## ఏళ్ల తరబడి సాగుతున్న బాబ్లీ కేసు విచారణ



వార్త మెయిన్‌లో...


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 06 జూన్, 2024 | పేజీలు : 05


# విజయవంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించాలి

**చిన్న తప్పకు ఆస్కారం ఇవ్వొద్దు**
**కలెక్టర్ పమేలా సత్పతి**



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జిల్లాలో ఈ నెల 9న జరగనున్న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షను అధికారులు సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అభ్యర్థుల భవిష్యత్తు దృష్ట్యా చిన్న తప్పుకు ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్‌లోని మహిళా డిగ్రీ కళాశాలలో గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల సూపరిండెంట్ల, అబ్వర్జర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సంధర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అబ్జర్వర్లు టిజిపిఎస్సీ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఆ మేరకు జాగ్రత్తగా గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించాలని సూచించారు. ఈ నెల 9న ఉదయం 9 గంటల వరకే పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని పేర్కొన్నారు. బయోమెట్రిక్ హాజరు విధానం ఉంటుందని తెలిపారు. 10 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారని చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ప్రైవేట్ కళాశాలల పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వ్యక్తులు పరీక్ష రోజున ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఏ చిన్న తప్పు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష పూర్తయిన తర్వాత ఓఎంఆర్ షీట్లు, హాజరైన అభ్యర్థుల సంఖ్య తేడా రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. పరీక్షకు రెండు రోజుల ముందే సెంటర్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొబైల్ ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రాల్లో అనుమతి లేదని తెలిపారు. నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పరీక్ష ప్రశాంతంగా సాగేలా ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని తెలిపారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు సరిగా పనిచేస్తున్నాయో లేదో ఒక రోజు ముందే చూసుకోవాలని పేర్కొన్నారు. మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు కేంద్రాల్లో కనిపిస్తే క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని హెచ్చరించారు. అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అభ్యర్థుల సిట్టింగ్ ఆరేంజ్‌మెంట్లు పక్కాగా నిర్వహించాలని, ఇబ్బందులు పడకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ డి.శ్రీలక్ష్మి, కొండగట్టు జేఎన్టీయు ప్రొఫెసర్ బి.సతీష్ కుమార్, కలెక్టరేట్ సూపరిండెంట్ కాళీచరణ్, పరీక్ష కేంద్రాల సూపరిండెంట్లు, అభ్యర్వర్లు పాల్గొన్నారు.

# అనుమతిలేని ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి**
**మచ్చ రమేష్**




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** అనుమతి లేని ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆద్వర్యంలో జిల్లా ఇంటర్ విధ్యాధికారిని (డీఐఇవో) కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సంధర్బంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్‌లు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని , ప్రైవేట్ కార్పోరేట్ కళాశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించి ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల జాబితాను బహిర్గతం చేసి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని, పేద మద్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ కళాశాలలు అభివృద్ధి పరచేలా అధికారులు కృషి చేసి ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలో సైన్స్ విద్యార్థులకు లాబ్స్ , ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా కంప్యూటర్స్ లాంటి పరికరాలను అందుబాటులో ఉంచి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేని కళాశాలలపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వ కళాశాలలు బలోపేతం చేయక నిమ్మకు నీరెత్తినట్లు ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తే ఏఐఎస్ఎఫ్‌గా ఉద్యమ కార్యచరణ సిద్ధం చేసుకుని దశలవారీగా ఉద్యమాలు చేస్తామని, ప్రభుత్వ విద్యను కాపాడి అనుమతి లేని ప్రైవేట్ కళాశాలలు మూసివేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపెల్లి హేమంత్, జిల్లా నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులున్నారు.

## తప్పదారి పట్టిస్తున్న ఆదిత్య కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

**అడ్మిషన్ ఆదిత్య కళాశాల..**
**క్లాసులు ఆకాష్ కాలేజీలో**
**ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు**
**మహేందర్, యుగంధర్**

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి కరీంనగర్ నగరంలోని ఆర్టీసీ వర్క్‌షాపు దగ్గర రేకుర్తి వెళ్లేదారిలోని ఆదిత్య జూనియర్ కళాశాల యాజమాన్యం పూర్తిగా విధ్యార్థులను తప్పుదారి పట్టిస్తోందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగంధర్‌లు ఆరోపించారు. అడ్మిషన్లు ఆదిత్య కళాశాల పేరుతో రశీదులిస్తూ విధ్యార్థులకు స్పెన్సర్ షాపింగ్ మాల్‌లో గల ఆకాష్ జూనియర్ కళాశాలలో తరగతులను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంత నిస్సిగ్గుగా నిబంధనలు తుంగలో తొక్కి తరగతులు నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కళాశాల ఎక్కడ ఉంటే అక్కడ తరగతులు నిర్వహించాలి కానీ ఒక కళశాల విధ్యార్థులు మరో కళాశాలలో తరగతులు నిర్వహించడం నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కడమేనన్నారు. వెంటనే కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు వెంటనే ఆకాష్ జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐవైఎఫ్ ఆద్వర్యంలో ఆదిత్య, ఆకాష్ జూనియర్ కళాశాల ముందు ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## గ్రూప్ -1 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** ఈ నెల 9న జరిగే గ్రూప్1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్ 1 పరీక్ష నిర్వహణపై పరిశీలకులు,చీఫ్ సూపరిండెంట్లు రూట్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్ 1 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.టీజీపీఎస్సీ కమిషన్ నిబంధనలను అభ్యర్థులు,అధికారులు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు,చేతి గడియారాలు,బూట్లు,సహా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదన్నారు.ఉదయం పదిగంటలలోపు పరీక్ష కేంద్రాలలోకి చేరుకోవాలని,ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదన్నారు.

# పర్యావరణాన్ని పరిక్షించుకోవాలి



ప్రజాపక్షం/చిగురుమామిడి : చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో డబ్ల్యూడ బ్ల్యూఎఫ్ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ వారి బిసిఐ , ఎస్‌యల్‌యమ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గ్రామ రైతులతో కలిసి 18 రకాల విత్తనాలతో 6 వేల విత్తన బంతులు (సీడ్ బాల్స్)ని తయారు చేసి పాండవుల గుట్ట పొట్టి గుట్టలపై వేశారు. ఫలితంగా వర్షం పడితే విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా తయారై రానున్న కాలంలో ఈ చెట్లు పండ్లు, కాయలు కాయడం వల్ల వన్యప్రాణులకు ఆహారంగా ఉపయోగపడుతుందన్నారు. వాటికి ఆహారం సమృద్ధిగా దొరకడం వల్ల రైతుల పంట పొలాలు నష్టం జరగదని పి.యు మేనేజర్ సింధు తెలిపారు. కార్యక్రమంలో సమన్వయ కర్తలు రామారావు, విష్ణువు, రమేష్, సాయికిరణ్, తిరుపతి, శ్రీనివాస్, జితేందర్ రెడ్డి, మౌనిక, మమత, సోనీ, రజిత రైతులు పాల్గొన్నారు.

## గురుకుల డిగ్రీ కళాశాలలో పర్యావరణ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/కొత్తపల్లి : కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సమత ఆధ్వర్యంలో కళాశాల లైఫ్ సైన్సెస్ విభాగం సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుష్మ, ఏసివోడి లలితా అశ్విని, వృక్ష శాస్త్ర విభాగాధిపతి ఎన్.శ్రీలత, మైక్రో బయాలజీ విభాగాధిపతి కె.గీతా రాణి, జంతు శాస్త్ర విభాగాధిపతి వి.జ్యోతి రెడ్డి, అధ్యాపకులు కవిత, రాధిక, స్వాతి, విద్యార్థినులున్నారు.

## పెద్దపల్లి ఎంపిని కలిసిన పెగడపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు



ప్రజాపక్షం/పెగడపల్లి: జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడితో పాటు మండల కాంగ్రెస్ నాయకులు పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేకానందలను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ తరపున పెద్దపల్లి ఎంపి పోటీ చేయగా మంగళవారం జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో ఎంపిగా గడ్డం వంశీకృష్ణ గెలుపొందిన సందర్భంగా మంచిర్యాలలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పెగడపల్లి మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కాసం శ్రీనివాస్ రెడ్డి, నంచర్ల పిఎసిఎస్ మాజీ చైర్మన్, మండల కాంగ్రెస్ నాయకులు అమ్మిరిశెట్టి మల్లారెడ్డి, ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ మండల నాయకులు దీకొండ మహేందర్, నాయకులు పుల్కం మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతిలేని కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

### టిఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల లక్ష్మణ్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నడుస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహాస్వామికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల లక్ష్మణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా , తోకపేర్లతో నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. వాటిని సీజ్ చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అనుమతి లేని పాఠశాలల వివరాలను విద్యాశాఖ అధికారులు ప్రకటించాలన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకుని, వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎంఆర్పిఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు దీకొండ కుమార స్వామి పాల్గొన్నారు.



# కలెక్టర్ పమేలా సత్పతికి టీఎన్జీవోల శుభాకాంక్షలు



ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్ పార్లమెంటు ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించినందుకు గాను టీఎన్జీవోస్ జిల్లా సంఘం, ఎంప్లాయిస్ జేఏసి చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ ధ్యేయంగా భావించి ఓటు విలువను అందరికీ తెలియపరుస్తూ చైతన్యపరిచారని కొనియాడారు. ఎన్నికల్లో శాంతియుతంగా అసౌకర్యం కలగకుండా ఉద్యోగులందరినీ కోఆర్డినేట్ చేసి విజయవంతంగా నిర్వహించారన్నారు. ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వర్తించిన జిల్లా అడ్మినిస్ట్రేషన్‌కు ఎన్నికల కౌంటింగ్ , ఎలాంటి అవకతవకలు లేకుండా దిగ్విజయంగా నిర్వహించిన కౌంటింగ్ సిబ్బందికి పోలీసు యంత్రాంగాన్ని కో ఆర్డినేట్ చేసుకుని శాంతి భద్రతల పరిరక్షణను కాపాడిన పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, కోశాధికారి కిరణ్ కుమార్, హర్మీందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి నేరెళ్ల కిషన్, జిల్లా నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, రాజేశ్వర్ రావు, సబిత, సునీత, సేవ్యా నాయక్, జీవన్ రెడ్డి, టిజివో నాయకులు కాళిచరణ్, సుధాకర్, అజయ్ కుమార్, మనమీత్ సింగ్, లవ కుమార్, రజనీకర్ రెడ్డి తదితరులున్నారు.

# పేద కూలీలకు అండగా హెచ్‌ఎంఐ

ప్రజాపక్షం/గంగాధర : నిరుపేద కూలీలకు గ్రామీణ కూలీల అభివృద్ధి సంక్షేమ సంస్థ నిర్వాహకులు అండగా నిలుస్తున్నారు. ఈ సంస్థలో సభ్యత్వం కార్డు తీసుకున్న గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి చెందిన నల్ల సంతోష్ రెడ్డి గత కొద్ది రోజుల క్రితం అతనికి యాక్సిడెంట్‌లో వెన్నుపూసకు గాయం కాగా విషయం తెలుసుకున్న గ్రామీణ కూలీల అభివృద్ధి సంక్షేమ సంస్థ వారు బాధితునికి అండగా నిలబడి వారికి పదివేల రూపాయలు, 25 కిలోల బియ్యం బస్తా అందించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ సంస్థలో వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీలు, భవన నిర్మాణ కూలీలు, ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కూలీలు గ్రామీణ కూలీల అభివృద్ధి సంక్షేమ సంస్థలో సభ్యత్వం కార్డు తీసుకోవడం ద్వారా పనిచేస్తుండగా ఏదైనా ప్రమాదం జరిగితే గ్రామీణ అభివృద్ధి సంస్థ వారు గుర్తించి వారికి పదివేల రూపాయలు, 25 కిలోల బియ్యం అందివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ గజ్జల సతీష్, పిఆర్వోలు పొత్తూరి సురేష్, నల్లాల రాజేందర్, చిరంజీవి, కిషన్, లింగయ్య తదితరులున్నారు.



# ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/గంగాధర : చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. గంగాధర క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యంకు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో 30 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. శుభమస్తు ఫంక్షన్ హాలులో నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు భోజనం ఏర్పాటు చేశారు. క్యాంపు కార్యాలయంతో పాటు చొప్పదండి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తన జన్మదినం సందర్భంగా బొకేలు, శాలువాలు తీసుకురావద్దని ఎమ్మెల్యే సూచన మేరకు నాయకులు, కార్యకర్తలు నోట్‌బుక్స్, పెన్నులు తీసుకువచ్చి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేస్తామని తెలిపారు. తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు.



# కెసిఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే సుంకె



ప్రజాపక్షం/గంగాధర : చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసారు. ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కెసిఆర్‌తో సమావేశమయ్యారు. మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ఓటమిపై చర్చించినట్లు సమాచారం.

## స్కూల్‌కు విరాళం అందజేసిన డాక్టర్లు



ప్రజాపక్షం/కొత్తపల్లి : శ్రీ సరస్వతి శిశు మందిర్ హైస్కూల్ కరీంనగర్ పాఠశాలకు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి రజినీ ప్రియ వివాహ మహోత్సవం సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణానికి ఒక గదికి అయ్యే ఖర్చును విరాళంగా అందజేశారు. శ్రీ సరస్వతి విద్యాపీఠము పాలకమండలి సభ్యులు, సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, పూర్వ విద్యార్థి బొల్లం మహేష్ విరాళం అందుకున్నారు. విరాళం అందజేసిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు బల్మూరి కరుణాకర్‌రావు, పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ప్రధానచార్యులు రాజమౌళి, పాఠశాల సిబ్బంది తదితరులున్నారు.

## 10వ తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ హిందీ పరీక్ష ప్రశాంతం

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : 10వ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ హిందీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సందర్భంగా బుధవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 14 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, ఒక్క విద్యార్థి హాజరైనట్లు తెలిపారు. డి.ఈ.ఓ, అసిస్టెంట్ కమీషనర్ పరీక్షల విభాగం పరీక్షా కేంద్రాన్నిపర్యవేక్షించి, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని, హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డి.ఈ.ఓ. మాధవి ఆ ప్రకటనలో తెలిపారు.

## డిగ్రీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : మహాత్మా జ్యోతిబా పూలే పురుషుల డిగ్రీ గురుకులంలో ప్రవేశాలకు అరుహులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.హుస్సేనప్ప ఒక ప్రకటనలో తెలిపారు.2024 25 విద్య సంవత్సరానికి గాను డిగ్రీలో (B.Sc(MPC, MPCS, MSCs, BZC, MBZC), B.Com(CA, BA), B.A(HPS), BBA) గ్రూపుల్లో ఇంగ్లీష్ మీడియంలో సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు.నాణ్యమైన విద్యతో పాటు ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## కార్యకర్త తండ్రి పాడెమోసిన స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ప్రజాపక్షం/లోకేశ్వరం : పార్టీని నమ్ముకున్న వారికి అండగా ఉంటామని మరోసారి నిరూపించిన ఎమ్మెల్యే.. లోకేశ్వరం మండల కేంద్ర భారతీయ జనతా పార్టీ కార్యకర్త రాజశేఖర్ తండ్రి మాజీ సర్పంచ్ భూమన్న అంత్యక్రియల్లో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా ఉంటామని తెలియజేశారు.

## నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాపక్షం/కుంటాల : నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రానికి చెందిన అనూష,అనుప్రియ అనే ఇద్దరు చెవిటి,మూగ వికలాంగ పిల్లల తల్లి ఐదు సంవత్సరాల క్రితం మరణించింది.ఇటివల తండ్రి సాంగి శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందాడు .దీంతో తల్లి,తండ్రిని కోల్పోయిన పిల్లలను బుధవారం బాలల సంరక్షణ అధికారి శ్రీనివాస్,చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ గంగాధర్ సామాజిక కార్యకర్త మమత వారి ఇంటికి వెళ్లి తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులు అందజేశారు.వీరి సంరక్షణకై ఐసీపీఎస్(ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రోటెక్షన్ స్కీం) ద్వారా తగు చర్యులు తీసుకునే విధానాలను వారి బంధువులకు గ్రామ పెద్దలకు తెలియజేశారు.మూడు నాలుగు రోజుల్లో వారు తమ అభిప్రాయాలను తెలియజేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ విశారద,ఎంపీపీ అప్కా గజ్జరాం యాదవ్,మాజీ సర్పంచ్ ధోనికెని సమత వెంకటేష్,మాజీ ఎంపీటీసీ మానాజీగారి పోశెట్టిత,ఆయాలు తదితరులు పాలొగన్నారు.

## అనాథ బాలికను ఆశ్రమానికి అప్పగించిన యువకులు

ప్రజాపక్షం/చింతలమానేపల్లి : చింతలమానపల్లి మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన గౌర్లపల్లి శైల తల్లి తండ్రి అయిదు సంవత్సరాల క్రితం మరణించడంతో శైల అనాథగా మిగిలింది. సామాజిక కార్యకర్త, యువ నాయకులు చప్పిడి ప్రకాష్, సిద్ధం పెంటన్న శైలను చూసి మనసు చలించి అనాథ ఆశ్రమంలో చేర్పించాలనే ఉద్దేశంతో మంచిర్యాల పట్టణంలోని కల్వరి యువశక్తి ఆశ్రమ అధ్యక్షులు డాక్టర్ ముల్కల కుమార్ కు సమాచారం అందించడంతో వెంటనే స్పందించి బాబాసాగర్ గ్రామానికి వచ్చి చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నరేష్, గ్రామస్తుల సమక్షంలో అనాథ అశ్రమ అధ్యక్షులు డాక్టర్ ముల్కల కుమార్ కు అప్పగించారు. అదే గ్రామానికి చెందిన కమల మధునక్క ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో శైలను కల్వరి అనాథ ఆశ్రమానికి తరలించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక యువ నాయకులు చప్పిడి ప్రకాష్ మాట్లాడుతూ గ్రామాల్లో అనాథ పిల్లలు రోడ్లపై కానీ, ఎక్కడైనా కనిపిస్తే తమకు సమాచారం అందించాలని అన్నారు. కల్వరి యువశక్తి అనాథ ఆశ్రమ అధ్యక్షులు డాక్టర్ ముల్కల కుమార్ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్ది శంకర్, పిప్పిర సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించాలి




ప్రజాపక్షం / గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మిపూర్ గ్రామపంచాయతీని పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పంచాయితీ అధికారి సురేష్ రెడ్డి పర్యటించడం జరిగింది. మొబైల్ అప్ ఇన్స్పెక్షన్‌లో భాగంగా మండలంలోని లక్ష్మిపూర్ గ్రామపంచాయితీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని చెట్లను పెంచడం ద్వారా భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించగలమని అన్నారు. స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయడం గురించి మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను కాపాడవలిసిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. కంపోస్టు ఎరువు తయారు ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని, తయారు చేసిన కంపోస్టు ఎరువును నర్సరీ, పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను వినియోగించాలని తెలియజేశారు. స్మశాన వాటిక, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, స్మశాన వాటిక పరిసరాలలో ఉన్న మొక్కలను సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించి, తరువాత గ్రామ పంచాయితీ రికార్డులు తనిఖీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సురేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీవన్, ఎంపిటిసి గోవిందుల లావణ్య జలపతి, అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : జిల్లాలోని పలు ఆసుపత్రులలో వైద్య సిబ్బందికి అగ్ని ప్రమాదాలు సంభవించ కుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని పెద్దపల్లి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ డి.శ్రీనివాస్ తెలిపారు.బుధవారం పెద్దపల్లి పట్టణంలోని సాయి వంశీ, ఆర్కే హాస్పిటల్స్ నందు వైద్యులకు, వైద్య సిబ్బందికి ఎలక్ట్రికల్ ఫైర్స్ సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ సేఫ్టీ సిస్టమ్, ఎమర్జెన్సీ డోర్ కలిగి ఉండాలని తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రులలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు రోగులను రక్షించే విధానం వైద్య సిబ్బందికి వివరించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫైర్ మాన్ ఎండి. ప్రవీణ్ కుమార్, హోం గార్డు ఎండి. అజ్జు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే సంప్రదించండి

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : జిల్లాలో విద్యుత్ సరఫరాలో ఏదైనా అంతరాయం ఏర్పడితే సంబంధిత అధికారులకు ఫోన్లో సంప్రదించాలని పెద్దపల్లి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బొంకురి సుదర్శన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు తమకు ఏ విధమైన విద్యుత్ సమస్యలు ఉన్న వెంటనే సంబంధిత సెక్షన్ అధికారికి, విద్యుత్ బిల్లులకు సంబంధించిన సమస్యలు ఉంటే సంబంధిత అసిస్టెంట్ అకౌంట్ అధికారికి ఫోన్ ద్వారా తెలియజేస్తే వారి సమస్యలు పరిష్కరించ బడతాయని అన్నారు. ప్రతి నెలా వినియోగదారులకు అందించే కరెంట్ బిల్లులలో సెక్షన్ అధికారి,అసిస్టెంట్ అకౌంట్ అధికారి ఫోన్ నెంబర్లు ముందు భాగాన క్రింద ప్రింట్ చేసి ఉంటాయని, వినియోగదారులు గమనించి వారి సమస్యలకు ఫోన్లో సంప్రదించాలని, ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే పై అధికారులైన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్ కు తెలిపి సమస్య పరిష్కరించు కోవచ్చని అన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 1912, 180004250028 నందు సైతం ఫిర్యాదు చేయవచ్చని, పెద్దపల్లిలోనీ సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 7901628367 నందు కూడా వినియోగదారులు తమ సమస్యలు తెలియజేయవచ్చని అన్నారు. రాబోయే వర్షాకాలంలో వినియోగదారులు వర్షం పడే సమయంలో, ఉరుములు మెరుపులు వచ్చినప్పుడు వైర్లు తెగిపడే అవకాశం ఉంటుందని, లైన్ల క్రింద ఉండవద్దని, స్తంభాలకు ఉన్న స్టే వైర్లు తాకరాదని, రాత్రి బాగా వర్షం వచ్చినప్పుడు తెల్లవారుజామున రైతులు పొలానికి వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

## పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణకి శుభాకాంక్షలు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణి పరిశ్రమ అభివృద్ధికై, కార్మికుల సమస్యల పరిష్కారాని కై పాటుపడాలని విజ్ఞప్తి.ఏఐటియుసి నాయకులు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం నుంచి గతంలో రెండు సార్లు బిఆర్ఎస్ తరుపున గెలిచిన ఎంపీలు కర్షక, కార్మిక సంక్షేమం కోసం చేసిందేమీ లేదని, పైగా వెంకటేష్ నేత ఐదేళ్లపాటు కాన రాలేదని, పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం అంటేనే కార్మిక వర్గానికి నిలయం. ఐదు సెగ్మెంట్లు అని, ప్రత్యక్షంగా పరోక్షంగా సింగరేణి గని కార్మికుల ప్రభావిత ప్రాంతం సిపిఐ, ఏఐటియుసి ల మద్దతుతో విజయాన్ని సొంతం చేసుకున్న గడ్డం వంశీకృష్ణ నూతన గనులు, ఉపాధి కల్పన, ఇన్కమ్ టాక్స్, సొంతింటి పథకం, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు మొదలగు విషయాల గురించి కేంద్ర, రాష్ట్ర స్థాయి లో కృషిచేసి కార్మిక వర్గానికి మేలు చేయాలని,అందరికీ అందుబాటులో ఉండాలని విజ్ఞప్తి చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తుందని ఆ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు ఒక సంయుక్త ప్రకటన లో తెలిపారు.

## ఎంపికైన విద్యార్థులు 10 లోపు అడ్మిషన్ తీసుకోవాలి

ప్రజాపక్షం/మందమర్రి : తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ల కొరకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన ఆరవ తరగతి, ఏడవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోపు అడ్మిషన్ తీసుకోవాలని ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా అనివార్య కారణాల వలన 10వతేది లోపు అడ్మిషన్ తీసుకోకుంటే వారి సెలక్షన్ రద్దైనట్లు పరిగణించడం జరుగుతుందని, తరువాత ఉన్న మెరిట్ రిజర్వేషన్ల ఆధారితంగా విద్యార్థులకు అడ్మిషన్ కల్పించడం జరుగుతుందని తెలిపారు. అడ్మిషన్లకు వచ్చే విద్యార్థులు తమ వెంట సంబంధిత ధృవీకరణ పత్రాలను తీసుకురావాలని కోరారు.

## వంశీకృష్ణ గెలుపు..అభివృద్ధికి పునాది

ప్రజాపక్షం / బుగ్గారం : పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులుగా యువ నాయకులు గడ్డం వంశీకృష్ణ గెలుపు నియోజకవర్గ అభివృద్ధికి పునాది అని జగిత్యాల జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎన్నం కిషన్ రెడ్డి అన్నారు. పెద్దపల్లి ఎంపిగా వంశీకృష్ణ గెలుపు పట్ల బుగ్గారం మండలం చందయ్యపల్లి, చిన్నాపూర్ గ్రామాల్లో ఎన్నం కిషన్ రెడ్డి నాయకత్వంలో గట్టు గంగారాం, గాదె ప్రభాకర్, బుర్ర రమేష్, పూజల కనుకయ్యల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్ల తిరుపతి, గడ్డం నారాయణ, దమ్మ లక్ష్మణ్, రంజిత్, గజ్జెల జనార్ధన్, దుర్గాప్రసాద్, రాజేష్, రవీందర్, ఇంద రాజయ్య, భీమయ్య, సుంకె చందు, నర్సయ్య, రాజేశం, మల్లేశం, వంతడ్పుల శంకర్, ప్రభాకర్, శంకర్, అభి తదితరులు పర్యటించి, బాణాసాంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

## బడి పిల్లలు భద్రమేనా



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : జిల్లాలో స్కూల్ బస్ ఫిట్నెస్ పై రవాణా శాఖ అధికారులు దృష్టి సారించాలి అని ఆర్టీవో ఆఫీస్ లో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సింగరి వెంకటేష్,మాట్లాడుతూ కొన్ని రోజులో విద్యాసంస్థలు పున ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులను తరలించే బస్సుల సామర్థ్యం పక్కాగా ఉండేలా చూడాలని ఫిట్నెస్ లేకుండా బస్సులు నడిపితే చర్యలు తీసుకోవాలని అన్నారు.ఫిట్నెస్ లేని బస్సులను వెంటనే సీస్ చేయడంతో పాటు విద్యా సంస్థల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని అన్నారు.ప్రైవేట్ స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లకు అనుభవం,ఆరోగ్యంగా ఉండేవారిని తీసుకోవాలని,విద్యార్థుల భద్రత,రక్షణ ను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ విద్యాసంస్థలు,స్కూల్ బస్సులోను ఫిట్నెస్ గా ఉండే బస్సులోనే నడపాలని విద్యాసంస్థలకు,సూచన చేయాలని అన్నారు.స్కూల్ బస్సులకు తప్పనిసరిగా ఫిట్నెస్ చేయించిన తర్వాతే స్కూల్ బస్సులు నడపాలని,సీట్లకు మించి విద్యార్థులు ఎక్కువగా ఉండకుండా చూడాలని,అన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



ప్రజాపక్షం/కడెం : మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలో గల అంగన్వాడీ టీచర్ ఎం.లక్ష్మి,మిషన్ శక్తి సిబ్బందితో కలిసి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో చెట్లను నాటుదం పర్యావరణాన్ని కపాడుదం అనే నినాదలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.అనంతరం మొక్కలు నాటారు,విత్తనాలు నాటడం,మొక్కల పెంపకం పట్ల అంగన్వాడా బెన్ఫిషర్సు కు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుమలత,పుష్పలత,అంగన్వాడీ బెన్సిశర్లు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలలో గెలుపోటములు సహజం

## ఆత్రం సుగుణను కలసిన నిర్మల్ కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** ఉట్నూర్ లో కాంగ్రెస్ అదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గా పోటీచేసీ ఓడిపోయిన ఆత్రం సుగుణ ను బుధవారం కలిసి నిర్మల్ జిల్లా కాంగ్రెస్ ఆయా విభాగాల పదాధికారులు,నాయకులు కలిసి ఓదార్చారు.రాజకీయాలలో గెలుపోతటములు సహజమని ఎలాంటి ఆధారానికి గురి కావద్దని,కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి మనోధైర్యాన్ని ఇచ్చారు.వీరివెంట న్యాయవాది శంతన్ రెడ్డి,నిర్మల్ జిల్లా కృష్ణవేణి,నిర్మల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎంబరి గంగాధర్,సయ్యద్ ఖాజా అక్రం అలీ తదితరులు ఉన్నారు.

# ఇంటర్మీడియట్ విద్యార్థుల ఎంపిక జాబితా విడుదల

**ప్రజాపక్షం/కుంటాల :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల,కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థిని,విద్యార్థుల ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.పదవ తరగతిలో సాధించిన మెరిట్ రోస్టర్ ఆధారంగా గ్రూపుకు 40 మంది చొప్పున మొత్తం 160 మంది విద్యార్థులవు ఎంపికైనట్లు తెలిపారు.ఎంపికైన విద్యార్థులు ఈ నెల 10వ తేది నుండి 15 తేది వరకు ఒరిజినల్ ధ్రువపత్రలతో టి.సి,బోనాఫైడ్, పదవ తరగతి మెమో,కుల దృవీకరణ పత్ర,ఆధార్ కార్డు,2ఫోటోలు,2 సెట్ల జిరాక్స్ కాపీలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు. నిర్ణీత సమయంలో గా హాజరుకాని విద్యార్థులు అడ్మిషన్ రద్దు చేయబడుతుందన్నారు.ఎంపిక జాబితాను కళాశాల ఆవరణలో నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

# గడ్డం వంశీకృష్ణకు నాయకుల ఘన సన్మానం

**ప్రజాపక్షం/మంథని :** పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బారీ మెజార్టీతో విజయం సాధించిన గడ్డం వంశీకృష్ణను పెద్దపల్లి జిల్లా మంథని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో స్థానిక నాయకులు గడ్డం వంశీకృష్ణను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు చెప్పి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వొడ్నాల శ్రీనివాస్,జనగామ నర్సింగరావు, ఎల్లంకి వంశీ, ఐలి శ్రీనివాస్, మల్లేష్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండలంలోని పిప్రి గ్రామంలో బుధవారం రోజున ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెట్లు పెంచడం వాటి పరిరక్షణ చేయడం పై ప్రతిజ్ఞ చేయించిన ఎంపీడీవో సోలామాన్ రాజ్ ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలోని చెరువు కట్ట వద్ద మొక్కలు నాటడం జరిగిందని మొక్కలను పెంచడం వలన వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని మొక్కలు నాటడం మనందరి బాద్యత అని గ్రామ పెద్దలు రైతులతో కలిసి ప్రతిజ్ఞ చేయడం జరిగిందని మానవాళి మనుగడకు కీలకం చెట్లు అని భావితరాలకు మన అందించాల్సిన గొప్ప సంపద పర్యావరణం ప్రకృతి పై మనకు ఎంత హక్కు ఉందో దాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్,టీఏ మంజుల,ఎఫ్ ఏ లోలం రమేష్,పంచాయతీ సెక్రెటరీ రాజేందర్,కారోబార్ బాబు గ్రామస్తులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కుంటాల :** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల అంగన్వాడి సెంటర్లలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి విశారద ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 ను పురస్కరించుకొని పర్యావరణ ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛమైన అహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయడం గురించి మొక్కలు నాటాలని,నాటిన ప్రతి మొక్కను కాపాడలసిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ రహీం,అంగన్వాడీ టీచర్లు,పంచాయతీ సెక్రెటరీలు,రాజబాపు,గ్రామ పెద్దలు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మంథని:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పెద్దపల్లి జిల్లా మంథని ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. మంథని మండలం గుంజపడుగు సెక్టార్ సూపర్‌వైజర్ అనిత ఆధ్వర్యంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పర్యావరణంపై అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని దుబ్బపల్లి, చిల్లపల్లి, గుంజపడుగు, విలోచవరం, సిరిపురం కేంద్రాల ఆవరణలో పిల్లలతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, వరుణ, రాజకుమారి, పద్మ, సరిత, రాజ్యలక్ష్మి, వసంత, రమ, బాగ్యలక్ష్మి, కౌసల్య, స్వర్ణలతతో పాటు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** మహిళ సాధికారత ఆద్వర్యం లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి లోని శాంతి నగర్ అంగన్వాడీ పాఠశాలలో మొక్కలు నాటించే కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా సాధికారత ఫైనాన్షియల్ లిట్రసి సేరు సంధ్య హాజరు అయ్యారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నేడు సందర్భంగా ఎడారీకరణను నిరోధించడానికి భూమిని పునరుద్ధించండి. మరియు కరువును ఎదుర్కోవడం ,ఈ ఆదేశాలను అనుసరించి ప్రతి ఇంటికి మొక్కలు నాటడం మరియు నీటి సంరక్షణ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించడం కోసం ఉద్దేశించింది. ఈ కార్యక్రమం లో భాగంగా మెడికల్ ఆఫీసర్ కీర్తన, అంగన్వాడి టీచర్ అనిత,ఏఎన్ఎం సునీత, ఆశాలు మరియు ఆయాలు, మహిళలు, పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రామగిరి మండలం నాగేపెల్లి గ్రామం లోని అంగన్వాడి 3వ కేంద్రంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గర్భిణి స్త్రీలకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మహిళా సాధికారత కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ చంద్రు స్వప్న తెలిపారు. ఈ సందర్భంగా జనరల్ స్పెషలిస్ట్ చంద్రు స్వప్న మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల పట్ల వివక్షత చూపవద్దని, లింగ నిర్ధారణ నిషేధం అని వివరిస్తూ, భ్రూణ హత్యలకు పాల్పడితే చట్టరీత్యా నేరమని, వైద్యులకు కూడ శిక్ష, జరిమాన ఉంటుందని అన్నారు.అడపిల్లలు ఎందులోను తక్కువ కాదని, మహిళలు పనిచేసే చోట అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్లు 181, 1098, 14567, 112, 14416 ల గురించి, మహిళా చట్టాలు, హక్కులు, సఖీ కేంద్రం సేవలు, పోక్సో చట్టం, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, అంగన్వాడి సేవలు, పోషకాహారం, పిల్లల పెరుగుదల,అనీమియ గురించి వివరించారు.అనంతరం పర్యావరణ దినోత్సవం సందర్భంగా పిల్లలు, తల్లుల చేతుల మీదుగా మొక్కలు నాటించి, పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, అంగన్వాడి సూపర్వైజర్ పి.శారద, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్, అంగన్వాడి టీచర్లు సుగుణ బాయి, లవణ్య, ఆయలు వసంత, మల్లీశ్వరి, మహిళలు పాల్గొన్నారు.



# చందుర్తిలో బిజెపి శ్రేణుల సంబరాలు

**ప్రజాపక్షం/చందుర్తి :** మంగళవారం వెలువడిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో బిజెపి మంచి ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చందుర్తి మండల కేంద్రంలో బిజెపి శ్రేణులు మంగళవారం రాత్రి టపాసులు వేయించి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ప్రజలు మరోసారి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కోరుకున్నారని, బీజేపీకి మరోసారి ప్రజలు అవకాశామీవ్వడం చాలా శుభపరిణామమని అన్నారు. కరీంనగర్ లో బండి సంజయని భారీ మెజారిటీ తో గెలిపించిన అందరికీ రుణపడి ఉంటామని, ఈ గెలుపు బిజెపి భాద్యత మరింత పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమం లో అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, మండల అధ్యక్షులు పొంచెట్టి రాకేష్, ప్రధాన కార్యదర్శి చిర్రం తిరుపతి, నాయకులు లక్కర్స్ శశికుమార్, ఒరగంటి విజయ్, మర్రి మల్లేశం, లింగాల రాజయ్య,మార్త రాజు, సిరికొండ తిరుపతి, అత్తేన మహేందర్ తదితరులు పాల్గొన్నారు.




# జెన్‌టియులో ప్రారంభమైన ఐసెట్ ప్రవేశ పరీక్షలు



**ప్రజాపక్షం /రామగిరి :** తెలంగాణ రాష్ట్రంలో ఎంబీఏ ఎంసీఏ కోర్సులు చేరేందుకు విద్యార్థులు వ్రాసే ఐసెటు ప్రవేశ పరీక్ష బుధవారం మంతిని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఆన్లైన్ ప్రవేశ పరీక్షల్లో మొదటి రోజు ఉదయం 150 మంది కి 139 మంది హాజరుకాగా 11 మంద్విజరయ్యారని మధ్యానం 150మంది కి 9, మంది గైహాజర్ కాగ 141మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపల్ చెరుకు శ్రీధర్ రెడ్డి తెలిపారు. పరీక్షలు జరుగుతున్న తిరుసు శాతవన యూనివర్శిటి అధ్యాపకురాలిని అబ్జర్వర్ గా నియమించరు. మధ్యానం ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు ల్యాబ్లో జరుగుతున్నపరీక్షలనుతిలికించారు. విద్యార్థులు నిర్ణీత సమయంలో పరీక్ష కేంద్రనికి చేరుకున్నరని ప్రినిస్పల్ తెలీ పారు.

# సమష్టి కృషితోనే గడ్డం వంశీ గెలుపు



**ప్రజాపక్షం/మంథని :** పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో మంథని మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తల సమిష్టి కృషితోనే గడ్డం వంశీకృష్ణ బారీ మెజార్టీతో విజయం సాధించారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్ అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు, యువ నాయకులు శ్రీనుబాబు నాయకత్వంలో గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడ్డారని ఆయన గుర్తు చేశారు.గడ్డం వంశీకృష్ణ గెలుపులో బాగస్వాములైన కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు, అన్ని విభాగాల నాయకులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో మండలం నుంచి అధిక మెజార్టీ ఇచ్చిన ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎల్లమ్మ పట్నాల్లో పాల్గొన్న నల్ల మనోహర్ రెడ్డి



**ప్రజాపక్షం/ సుల్తానాబాద్:** సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామంలో గల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాలకు నిర్వాహకుల ఆహ్వానం మేరకు హాజరై పెద్దపల్లి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్ రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు, వారితో పాటు గౌడ సంఘం నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు నల్ల ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

**ప్రజాపక్షం/ ముత్తారం:** సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ముత్తారం ఎస్సై మధుసూధన్ రావు అన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ చౌరస్తా వద్ద రామగుండం సిపి ఆదేశాల మేరకు ముత్తారం ఎస్సై మధుసూధన్ రావు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే,ఈకేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూ దదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నం బర్‌కు డయల్ చేయాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ముత్తారం పోలీసులు హెడ్ కానిస్టేబుల్ మధునయ్య,రమేష్, లక్ష్మ ణ్, తాండ్ర రాజు పాల్గొన్నారు.

# లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ : రక్షణతో కూడిన లక్ష్యాల సాధనకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని ఆర్‌కెపి సిహెచ్‌పి ఇంచార్జ్ ఎస్.ఇ. చంద్రమౌళి అన్నారు. బుధవారం ఆర్‌కెపి సిహెచ్‌పిలో కార్మికులకు రక్షణ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ తప్పనిసరిగా రక్షణ సూత్రాలని పాటించాలని, పని చేసే ప్రదేశంలో రక్షణతో కూడిన ఉత్పత్తికి తోడ్పడాలని అన్నారు. ప్రతికార్మికుడు (ఎస్‌ఓపి) సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ని అనుసరించాలని, ప్రతి ఒక్కరు పిపిఇ కిట్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఫిట్ సెక్రెటరీ హరి రామకృష్ణ, ఫోర్ మెన్ శ్రీనివాస్, చందు, కార్మికులు పాల్గొన్నారు.

# గనుల పైన ఐఎన్‌టియుసి సంబరాలు



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలిచిన ఆనందంలో ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఏరియాలోని అన్ని గనుల పైన బాణా సంచాలు కాల్చి, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం బ్రాంచ్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ పెద్దపల్లి ఎంపిగా గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం మంచిర్యాల ఎంఎల్ఎ ప్రేమ్ సాగర్ రావు, ఐఎన్‌టియుసి యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. జనక్ ప్రసాద్ నాయకత్వంలో కష్టపడిన కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టియుసి నాయకులు, కార్యకర్తలకు శుభాభివందనాలు తెలిపారు. ఎంపిగా గెలిచిన వంశీకృష్ణ సింగరేణి కార్మికుల కోసం వారు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యామ్, సెంట్రల్ డిప్యూటీ సెక్రెటరీ గరిగే స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు జె. నర్సింగ్, గోపాల్ రెడ్డి, వీరమల్లు, శ్రీనివాసరావు, సుధాకర్, పెట్టం శ్రీనివాస్, పాల్గొన్నారు.

# తిర్యానిలో పర్యావరణ దినోత్సవం



ప్రజాపక్షం/తిర్యాని : చెట్లతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని తిర్యాని, గిన్నెధరి అటవీశాఖ అధికారులు శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్ లు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అరటిపల్లి స్టేజి వద్ద మొక్కలను నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ మొక్కలను నాటి వాటిని పరిరక్షించి మన భావితరాలకు కాలుష్యరహిత వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇజిఎస్ ఎపిఒ షాకీర్ ఉస్మాని, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్లు మహేందర్, శ్రీనివాస్, రామ్ సింగ్ రవి ప్రకాష్, సిబ్బంది అంబారావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రేంజ్ కార్యాలయం నుండి ప్రధాన రహదారుల గుండా రెబ్బెన ఇంచార్జ్ రేంజ్ అధికారి శ్రీధరాచారితో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం పూర్తిగా కాలుష్యం అవుతుందన్నారు. దాన్ని తగ్గించడంలో ప్రతి వ్యక్తి ముఖ్యమైన పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. పరిశ్రమలు, వాహనాల నుంచి వచ్చే వ్యర్థాలు గాలిని, నీటిని, భూమిని, అంతరిక్షాన్ని అన్నింటిని కాలుష్యం చేస్తున్నాయని వీటి నివారణ కోసం సాధ్యమైనంత వరకు మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కల వల్ల కావలసినంత ఆక్సిజన్ లభించడంతో పాటు పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు సరోజరాణి, రాజేశ్వరాచారి, సెక్షన్ అధికారులు సాయి, సతీష్, భగవంతరావు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



ప్రజాపక్షం/మందమర్రి : అడవులు అంతరించడంతో జంతువులు, పక్షులు జనావాసాల్లోకి వచ్చి ఆహారాన్ని పొందాల్సి వస్తుందని, పండ్ల మొక్కల పెంపకంతో అటవీ జంతువులకు, పక్షులకు ఆహారాన్ని అందించడం సులువు అవుతుందని ఎజిఎం (ఇంజనీర్) నాగరాజు అన్నారు. బుధవారం మందమర్రి ఏరియాలోని కెకె 5 గని ఆవరణలో వృక్ష ప్రేమికుడు సింగరేణి సి అండ్ ఎండి బలరాం ఆదేశాల మేరకు గని మేనేజర్ అల్లాఉద్దీన్ ఆధ్వర్యం లో మంకీ ఫుడ్స్ కోర్ట్ కొరకు 200 పండ్ల రకాల చెట్లను నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా ఎజిఎం (ఇంజనీర్) నాగరాజు పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం తమ బాధ్యతగా తీసుకోవాలని, మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని తెలిపారు. గని మేనేజర్ మాట్లాడుతూ గని ఆవరణలో పండ్ల తోటలు నాటి, జంతువులు, పక్షులు తాగు నీటి కోసం తొట్టెలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ కూడ ప్రతి ఒక్కరు బాధ్యత గా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి రమేష్, అసిస్టెంట్ మేనేజర్ జశ్వంత్, సంక్షేమాధికారి కార్తీక్, ఫిట్ ఇంజనీర్ నవీన్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ బలరాం, గని పిట్ సెక్రెటరీ గాండ్ల సంపత్, వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్ విక్రమ్ సింగ్, ఆఫీస్ సూపరిండెంట్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు పర్యావరణం ప్రాముఖ్యతపై అవగాహన



ప్రజాపక్షం / జైనూర్ : పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జోడేఘాట్ ఇంచార్జ్ ఎఫ్ఆర్ఒ జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జైనూర్ మండల కేంద్రంలోని అటవీ కార్యాలయం నుంచి సిర్పూర్‌యు మండలం వరకు ర్యాలీగా వెళ్లి మొక్కలు నాటి పర్యావరణం యొక్క ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్రపంచ వ్యాప్తంగా పరిశ్రమలు ఎక్కువగా స్థాపించడం వలన పర్యావరణం లోపించి అనేక రకాలైనటువంటి వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. ఓజోన్ పొర పరిరక్షణ కోసం మనం పచ్చని చెట్లను పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఒలు సొకారం, భగవంత్ రావ్, ఎఫ్‌బిఒలు దేవిదాస్, బాల చందర్, వనిత, హరిత, సరిత, శివాని, శ్రీకాంత్, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దల బిసిజి టీకాతో టిబి నిర్మూలన

ప్రజాపక్షం / జగిత్యాల జిల్లా ప్రతినిధి : పెద్దల బిసిజి టీకాతో టిబి వ్యాధి పూర్తి నిర్మూలన సాధ్యమవుతుందని, బిసిజి టీకాపై అధ్యయనానికి రాష్ట్ర వ్యాప్తంగా 17జిల్లాలను ఎంపిక చేయగా, జగిత్యాల జిల్లా ఎంపికైందని జిల్లా ఉప వైద్యాధికారి డా. శ్రీనివాస్ అన్నారు. స్థానిక మినీ పద్మనాయక కళ్యాణ మండపంలో జిల్లాలోని వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఇతర సిబ్బందికి బిసిజి టీకాపై అవగాహన, శిక్షణ, అధ్యయనం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిబంధన మేరకు గుర్తించిన వారికే బిసిజి టీకా వేయడం జరుగుతుందని, ప్రతి మండలంలోని ఇంటింటి సర్వే నిర్వహించి బిసిజి టీకా లబ్ధిదారులకు గుర్తిస్తామని అన్నారు. జిల్లాస్థాయిలో శిక్షణ అనంతరం మండల స్థాయిలో వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఉంటాయని ఆయన పేర్కొన్నారు. బిసిజి టీకా ఉపయోగాలు, నిర్వహణ తదితర అంశాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు డాక్టర్ విష్ణు, ఆదిత్య, అతుల్ నగిమే, ప్రోగ్రాం అధికారులు డా. సమియోద్దీన్, డా. ఆకుల శ్రీనివాస్, డా. ఎం. జైపాల్ రెడ్డి, జిల్లాలోని వైద్యాధికారులు ఎం.ఎల్.హెచ్.పిలు, సూపర్‌వైజర్‌లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/ మంచిర్యాల : జిల్లాలో ఈ నెల 13 నుండి నిర్వహించనున్న సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ ధృవీకరణ పత్రం పొందేందుకు మీసేవలో స్లాట్ బుక్ చేసుకొని నిర్ణీత తేదీలలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించి నూతన దివ్యాంగ ధృవీకరణ పత్రం, గతంలో పొందిన ధృవీకరణ పత్రం కాలపరిమితి ముగిసిన వారు పునః రుద్ధరణ చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 13న శారీరక వికలాంగులు(ఆర్థో) (50), 19న మానసిక వికలాంగులు (50), 21న కంటిచూపు (30), 25న మూగ, చెవుడు (50) అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు స్లాట్ ఓపెన్ చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# మొక్కలతోనే వాతావరణ సమతుల్యత

ప్రజాపక్షం/సిర్పూర్ టి: పర్యావరణ పరిరక్షణతోనే సకల ప్రాణుల మనుగడ ఆధారపడిందని, అటువంటి పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపిడిఒ సత్యనారాయణ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిర్పూర్ టి మండలం లో అచ్చెలి గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపిడిఒ సత్య నారాయణ, పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఎంపిఒ కృష్ణ మూర్తితో కలిసి పర్యావరణ రక్షణ ప్రతిజ్ఞ చేయించినారు. పర్యావరణ సమతుల్యతపైనే సకల ప్రాణుల మనుగడ ఆధారపడిందని తెలుపుతూ మొక్కలు నాటారు.

# ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ

ప్రజాపక్షం/ కాగజ్ నగర్ : కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ఫెర్టిలైజర్ షాప్‌లను కాగజ్‌నగర్ టౌన్ టౌన్ సిఐ శంకరయ్య, కాగజ్ నగర్ వ్యవసాయ అధికారి మనోహర్‌లు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమాయక రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుల మందుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ఎవరైన నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మకం చేస్తున్నట్లు సమాచారం ఉంటే వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. దుకాణాదారులు అమ్మకం చేసిన ప్రతి వస్తువుకు పూర్తి వివరాలతో కూడిన రసీదులను అందించాలని, రైతులు రసీదులను జాగ్రత్తగా పంట కాలం ముగిసే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ కాగజ్ నగర్ మనోహార్ రావు, ఎఒ రామకృష్ణ, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

# సకాలంలో వాహన పన్ను చెల్లించాలి

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల జిల్లాలోని వాణిజ్య, వాణిజ్యేతర వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పన్నును సకాలంలో ముందస్తుగా జిల్లా రవాణ శాఖకు చెల్లించాలని మంచిర్యాల జిల్లా రవాణా అధికారి టి.సంతోష్‌కుమార్ తెలిపారు. సకాలంలో పన్ను చెల్లించనితో వాహన తనిఖీల సమయంలో సరైన పత్రాలు లేని వాహనాలకు చెల్లించాల్సిన వాహనపన్నుపై అపరాధ రుసుము విధించడం జరుగుతుందని తెలిపారు. అలాగే పన్ను మొదటి నెల 50 శాతం , రెండవ నెల వంద శాతం, మూడవ నెల 200 శాతంగా వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సకాలంలో తమ వాహన పన్ను చెల్లించుకోవాలని వివరించారు.

# పర్యావరణ రక్షణతోనే ప్రజా ఆరోగ్యం

ప్రజాపక్షం / మెట్ పల్లి : పర్యావరణ రక్షణతోనే ప్రజలు తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందని మెట్ పల్లి లీగల్ సర్వీసెస్ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం, మెట్ పల్లి కోర్టులో ఏర్పాటు చేసిన ప్రత్యేక హరితహారం కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం సరిగ్గా లేకపోతే సామాజికంగా ఘర్షణ వాతావరణం ఏర్పడుతుందన్నారు. సమాజంలో ఘర్షణలు నేరాలు లేని వాతవరణానికి అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు ఎలుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్, కోటగిరి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాపుల్లో నాణ్యత లేని బియ్యం



ప్రజాపక్షం / మల్లాపూర్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెల్ల రేషన్ కార్డు ద్వారా నిరుపేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో నాణ్యత లోపిస్తుందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెల అందించే బియ్యం పంపిణీలో కొద్దిపాటిగా నాణ్యత లోపించిన సరిదిద్దుకున్నామని, కానీ ఈ నెల రేషన్ షాపుల్లోకి వచ్చిన బియ్యంలో ఎక్కువ శాతం వడ్ల గింజలు, మట్టి పెళ్లలు వస్తున్నాయని, ఇలా నాణ్యత లోపించిన బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా నిరుపేదలకు అందించడంతో తమ కడుపులు ఎలా నింపుకోవాలని ప్రశ్నిస్తున్నారు. నాణ్యత లోపించిన బియ్యంతో రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు పర్యవేక్షించి నాణ్యత లోపిస్తున్న బియ్యాన్ని అందించకుండా చూడాలని కోరుతున్నారు.